ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



5 సిద్దిపేట
గురువారం 31 జూలై 2025

బీటీ పనులు
పూర్తయ్యేనా?
- పట్టించుకోని ప్రభుత్వం
- మల్లన్న భక్తులు, ప్రయాణికులకు తిప్పలు

8



సిద్దిపేట పట్టణంలో ఓ మహిళ వెంట పడుతున్న కోతులు

అమ్మో.. వానర సైన్యం



- సిద్దిపేటలో కోతుల బెడద
- అధికారుల నిర్లక్ష్యం.. ప్రజలకు ప్రాణసంకటం

సిద్దిపేటలో కోతుల బెడద రోజురోజుకు మితిమీరుతోంది. జనజీవనంపై కోతులు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. కిరాణా దుకాణాలు, పళ్ల బండ్లు, చివరికి పాదాచారులను కూడా వదలడం లేదు. కొన్ని కాలనీల్లో ఇళ్లలోకి దూరి ఆహారపదార్థాలను ఎత్తుకెళ్తున్నాయి. దీంతో పట్టణ ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి, ప్రజలకు నష్టం జరగకముందే కోతులను పట్టుకుని వనాలకు తరలించాలని కోరుతున్నారు. బుధవారం పట్టణంలో మహిళలు నడుచుకుంటూ వెళ్తుండగా కోతులు వారిపై దాడికి యత్నించాయి.

- సిద్దిపేట జిల్లా ఫొటోగ్రాఫర్, జూలై30 (ఆంధ్రజ్యోతి)

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలి : కలెక్టర్



మిరుదొడ్డిలో పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ హైమావతి

మిరుదొడ్డి/దుబ్బాక జూలై 30 (ఆంధ్రజ్యోతి) : విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని, ఎవరైనా విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని కలెక్టర్ హైమావతి హెచ్చరించారు. బుధవారం మిరుదొడ్డిలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంతో పాటు ఎస్సీ, బీసీ బాలుర వసతి గృహాలను, జడ్పీహెచ్ఎస్, ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో పలు రికార్డులను పరిశీలించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో విక్రయిస్తున్న ఎరువుల వివరాలను నమోదు చేయడంలో సీఈవో నిర్లక్ష్యం వ్యవహరించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. లక్ష్మీనగర్ గ్రామంలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. దుబ్బాక మండలం తిమ్మాపూర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం వండకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాధికారిని ఆదేశించారు. తిమ్మాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ అక్కడి వైద్యసేవలను పరిశీలించారు.



రాష్ట్రస్థాయికి ఎంపికైన అథ్లెటిక్స్ క్రీడాకారులు

అథ్లెటిక్స్‌లో ఉజ్వల భవిష్యత్

- డీవైఎస్‌వో వెంకట నర్సయ్య

సిద్దిపేట కల్చరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): అథ్లెటిక్స్‌లో రాణిస్తే క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని డీవైఎస్‌వో వెంకటనర్సయ్య అన్నారు. సిద్దిపేటలోని స్టేడియంలో జరిగిన జిల్లా అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు బుధవారం ముగిశాయి. జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎంపిక పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. అనంతరం విజేతలకు పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఆగస్టు 3, 4న హనుమకొండలో, 7న జనగాంలో జరిగే రెండు రాష్ట్రస్థాయి పోటీలకు వివిధ కేటగిరిలో 64 అంశాల్లో పోటీలు నిర్వహించి 60 మందిని ఎంపిక చేసినట్లు జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటస్వామిగౌడ్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శులు పన్యాల రామేశ్వర్‌రెడ్డి, గ్యాదరి బిక్షపతి, టీజీ పెటా జిల్లా అధ్యక్షుడు ఏర్వ అశోక్, రెజ్లింగ్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కడకంచి ఉప్పలయ్య, శిక్షకులు శారద, శౌర్య, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

సంతానం.. సంపాధనం

ఇక్కడా దందా!

- సిద్దిపేటలో పుట్టగొడుగుల్లా ఫర్టిలిటీ సెంటర్లు
- ఐవీఎఫ్, ఐయూఐ ముసుగులో రూ.లక్షల్లో లూటీ!

"మీకు పిల్లయి సంవత్సరాలు గడిచినా పిల్లలు లేరా? అయితే మా సెంటర్‌కు రండి, మీకు సంతానం గ్యారెంటీ!" ఇలాంటి ప్రకటనలు, ఫ్లెక్సీలు సిద్దిపేట జిల్లాలో విచ్చలవిడిగా కనిపిస్తున్నాయి. సంతానం లేని దంపతుల బలహీనతను ఆసరాగా చేసుకుని కొన్ని ఫర్టిలిటీ సెంటర్లు అడ్డగోలుగా దండుకుంటున్నాయి. కొందరు డాక్టర్లు కొత్త దందాకు తెరతీసి, అనుమతులు లేకున్నా నిబంధనలు పాటించకున్నా ఫర్టిలిటీ సెంటర్ల ప్రచారం జోరుగా సాగిస్తున్నారు. సంతాన సాఫల్య కేంద్రాల ముసుగులో పలువురు వైద్యులు అందినకాడికి దోచుకుంటున్నారు. కనీస నిబంధనలు పాటించకుండానే ఐవీఎఫ్, ఐయూఐ చికిత్సల పేరుతో రూ.లక్షల్లో దోపిడీకి పాల్పడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. హైదరాబాద్‌లో ఇటీవల బోగస్ ఫర్టిలిటీ సెంటర్ల బాగోతం బయటపడిన నేపథ్యంలో సిద్దిపేటలోనూ వైద్యశాఖ తనిఖీలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- సిద్దిపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

- అనుమతులు లేకున్నా ఇష్టారాజ్యంగా నిర్వహణ
- వైద్యశాఖ తనిఖీలు చేపడితే మరిన్ని వాస్తవాలు..

సిద్దిపేట జిల్లా కేంద్రం ఒక మెడికల్ హబ్‌గా మారింది. కాలి గోరు నుంచి తల వెంట్రుకల వరకు చికిత్సలు చేస్తాం అంటూ రకరకాల ప్రత్యేకతలను ప్రచారం చేస్తూ వైద్యులు పుట్టుకొస్తున్నారు. నిపుణులైన కొందరు డాక్టర్లు నాణ్యమైన వైద్యం అందిస్తుండగా, మరికొందరు ధనార్జనే ధ్యేయంగా విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే సంతాన సాఫల్య కేంద్రాలు యథేచ్ఛగా వెలుస్తున్నాయి. ఎలాంటి అర్హత, అనుభవం లేకున్నా సంతానం కలిగిస్తామంటూ ప్రచారం చేస్తున్నారు.

అనుమతులే లేవు!

జిల్లా వైద్యారోగ్య శాఖ రికార్డుల్లో ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. టెస్ట్‌ట్యూబ్ బేబీ, ఫర్టిలిటీ సెంటర్లు, సంతాన సాఫల్య కేంద్రాల పేరిట అనేక ఆసుపత్రుల ముందు బోర్డులు కనిపిస్తున్నప్పటికీ, వైద్యారోగ్య శాఖ వద్ద ఎలాంటి సమాచారం లేదు. ఫర్టిలిటీ సెంటర్ల పేరిట తమ నుంచి ఎలాంటి అనుమతులు పొందలేదని సంబంధిత అధికారులు చెబుతున్నారు. తమ లెక్కల ప్రకారం ఎవరికీ అనుమతులు ఇవ్వలేదని పేర్కొంటున్నారు. ఫర్టిలిటీ సెంటర్ల మోసాలపై తమకు ఫిర్యాదులు చేస్తే వెంటనే తనిఖీలు చేపడతామని సూచిస్తున్నారు. అయితే, కళ్లముందే ప్రకటనలు, ఫ్లెక్సీలు కనిపిస్తున్నా సదరు ఫర్టిలిటీ సెంటర్లలో తనిఖీలు ఎందుకు చేపట్టడం లేదో వైద్యారోగ్య శాఖ అధికారులకే తెలియాలి.

రూ.లక్షలు గుంజుతున్నారు!

సంతానం లేని దంపతుల బాధ వర్ణనాతీతం. సమాజంలో చిన్నచూపుతోపాటు మానసిక ఆవేదనను అనుభవిస్తూ ఉంటారు. ఇలాంటి వారు పిల్లల కోసం ఎన్ని డబ్బులైనా ఖర్చు చేయడానికి సిద్ధపడుతున్నారు. వీరి లోపాన్ని ఆసరాగా చేసుకొని వైద్యులు రూ.లక్షలు గుంజుతున్నారు. మొక్కుబడిగా ఐయూఐ (ఇంట్రా యుటెరైన్ ఇన్‌సెమినేషన్) చికిత్స చేస్తూ తమ టార్గెట్‌ను ఐవీఎఫ్ (ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్) వైపు మళ్లిస్తున్నారు. ఒక్కో ఐయూఐకి రూ.10వేల ఫీజుతో పాటు మెడిసిన్ పేరిట అదనంగా రూ.10 వేల దాకా లాగుతున్నారు. అండాన్ని వృద్ధి చేసే ఒక్కో ఇంజక్షన్‌కు రూ.5 వేలు తీసుకుంటున్నారని ఓ బాధితుడు వాపోయాడు. ఐవీఎఫ్‌కు రూ.లక్షల దాకా చెప్పి, రూ.50 వేల డిస్కౌంట్ ప్రకటిస్తున్నారు.



భార్యాభర్తల్లో ఎలాంటి లోపాలు లేవని, ఐవీఎఫ్ చేస్తే సంతానం కలుగుతుందని నమ్మబలకడంతో, అప్పులు తెచ్చి రూ.లక్షలు కుమ్మరిస్తున్న పరిస్థితి సిద్దిపేటలోని పలు సెంటర్లలో దాపురించింది.

అర్హతలు లేని వైద్యులు!

ఐవీఎఫ్ చికిత్స అంటే భార్య అండం, భర్త వీర్యాన్ని ప్రాసెస్ చేసి భార్య గర్భంలోకి పంపించే ప్రక్రియ. దీనిని కూడా సిద్దిపేటలోని తమ ఆసుపత్రుల్లో చేస్తామని ఒకరిద్దరు వైద్యులు చెప్పడం విడ్డూరంగా ఉంది. ఐయూఐ ప్రక్రియ వరకైతే పర్వాలేదు

మిగతా 8వ పేజీలో



ప్రజలతో ముఖాముఖీలో మాట్లాడుతున్న విద్యుత్ శాఖ ఎస్ఈ చంద్రమోహన్

వినియోగదారులకు
మెరుగైన సేవలు

- విద్యుత్‌శాఖ ఎస్ఈ చంద్రమోహన్

కొండపాక, జూలై 30 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నామని విద్యుత్ శాఖ ఎస్ఈ చంద్రమోహన్ తెలిపారు. ప్రజలతో ముఖాముఖీ కార్యక్రమాన్ని బుధవారం కొండపాక మండలం దుద్దెడలో విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ ప్రజలతో పలు అంశాలపై మాట్లాడారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మెరుగైన సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. గ్రామంలో బీసీకాలనీకి ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని, అలాగే గ్రామానికి ప్రత్యేకంగా ఫీడర్ ద్వారా విద్యుత్ సరఫరా అయ్యేలా పలువురి ఆయన దృష్టికి తీసుకొచ్చారు. కొన్ని ప్రాంతాలకు త్రీఫేజ్ రావడం లేదని ఆ సమస్య తీర్చాలని కోరారు. వాటన్నింటినీ పరిష్కరిస్తామని ఎస్ఈ తెలిపారు. ఆయన వెంట విద్యుత్ శాఖ ఏఈ సత్యం, లైన్ ఇన్‌స్పెక్టర్లు, జూనియర్ లైన్‌మెన్‌లు ఉన్నారు.

ప్రభుత్వ ప్రీప్రైమరీ స్కూళ్లు

- పంద్రాగస్టు నుంచి ప్రారంభానికి ఆదేశాలు
- ఉమ్మడి జిల్లాలో 106 ప్రభుత్వ పాఠశాలలు ఎంపిక
- బడ్జెట్ విడుదల, ఆయా, బోధకుల నియామకానికి ఆదేశాలు జారీ

7

రామలింగేశ్వరా.. ప్రసాదం ఏదీ?

- ఆరేళ్లయినా పూర్తికాని ఆలయ అభివృద్ధి పనులు..
- రూ. 40 కోట్ల పథకానికి మోక్షమెప్పుడో?
- కలగానే మిగిలిన కూడవెల్లి పర్యాటక కేంద్రం

దుబ్బాక, జూలై 30 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక నియోజకవర్గంలోని కూడవెల్లి రామలింగేశ్వర ఆలయం అభివృద్ధికి నోచుకోవడం లేదు. మూడు జిల్లాల సరిహద్దులో, మూడు వాగుల సంగమం వద్ద ఉన్న ఈ ఆలయాన్ని "దక్షిణ కాశీ" అని పిలుస్తారు. ఎంతో ప్రాశస్త్యం ఉన్న అక్బర్‌పేట- భూంపల్లి మండలం రామేశ్వరంపల్లి కూడవెల్లి క్షేత్రానికి లక్షలాది మంది భక్తులు వస్తుంటారు. మాజీ సీఎం కేసీఆర్ బాల్యంలో దుబ్బాకలో చదువుకుని, స్నేహితులతో మాఘమాస్యజాతరకు సైకిల్‌పై వచ్చి దర్శనం చేసుకున్న ఆలయమిది. దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి తన చిన్నతనంలో ఎడ్లబండ్ల మీద వచ్చి జాతరలో తిరిగిన అనుభూతులుంటే, వాగు అవతల గ్రామంలోని బొప్పాపూర్‌లో పుట్టి పెరిగిన మెదక్ పార్లమెంట్ సభ్యుడు మాధవనేని రఘునందన్‌రావు తిరిగాడిన ఆలయమిది. ఎంతో ప్రాశస్త్యం కలిగిన ఈ ఆలయ అభివృద్ధి పన్నెండేళ్లుగా కలగానే మిగిలింది.

అసంపూర్తిగా 'సీజీఎఫ్' పనులు

గత ప్రభుత్వ హయాంలో ఎంపీగా ఉన్న కొత్త ప్రభాకర్ రెడ్డి, సీజీఎఫ్ కింద రూ.1.25 కోట్లు మంజూరు చేయించారు. ప్రాకార మండపం, స్లాబ్, అమ్మవారి ఆలయం, రాధా రుక్మిణీ సత్యభామ వేణుగోపాలస్వామి గర్భాలయం, రాజగోపురం, ఫ్లోరింగ్ పనులు జరిగాయి. ఇంకా సుమారు రూ.60లక్షల పనులు మిగిలి ఉన్నాయి. గతంలో చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్ పనులు చేయడంలో జాప్యం చేశాడు. దీంతో మిగిలిన నిధులు వెనక్కి వెళ్లిపోయాయి. ఇటీవల దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి దేవాదాయశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అసంపూర్తి పనుల ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపాలని ఆదేశించారు. ఈ పనులు పూర్తయితే ఆలయంలోని ఉపాలయాలకు పూర్వ వైభవం వస్తుంది.

కలగానే 'ప్రసాద్' పథకం

మూడు వాగుల కూడలిగా ఉన్న కూడవెల్లి రామలింగేశ్వర ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని అధికారులు



అసంపూర్తిగా ఆలయ ప్రాకారం.. దానిపై పూర్తికాని దేవుళ్ల శిల్పాలు

భావించారు. అప్పట్లో ఎమ్మెల్యేగా ఉన్న మాధవనేని రఘునందన్‌రావు కేంద్ర ప్రభుత్వం ద్వారా "ప్రసాద్" పథకానికి ఆలయాన్ని ఎంపికకు కృషి చేశారు 2022 అక్టోబరు 20న కేంద్రం ఈ ఆలయాన్ని 'ప్రసాద్' పథకానికి ఎంపిక చేస్తున్నట్లు ప్రకటించింది. సుమారు రూ. 40కోట్ల నిధుల కేటాయింపుతో ప్రసాద్ పథకానికి ఎంపిక చేశారు. కేంద్రం సూచించిన 20 రకాల అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు కోరింది. ఆలయ కమిటీ వివిధ సర్వే నంబర్ల నుంచి కలిపి మొత్తం 9 ఎకరాల 3 గుంటల భూమిని సేకరించింది. ఇందులో ఎకరం భూమిని 'ప్రసాద్' పథకం పనులకు కేటాయించారు. భక్తులకు మరుగుదొడ్లు, వేచి ఉండే గదులు, తాగునీరు, ప్రసాదం కౌంటర్లు, ప్రాథమిక విచారణ కేంద్రం, ప్రథమ చికిత్సా కేంద్రం, లాకర్ రూమ్, క్యాంటీన్, ఏటీఎం సెంటర్, మల్టీపర్పస్ హాల్, పార్కింగ్, సోలార్ ప్యానళ్లు, ఇంకుడు గుంతలు, ప్రహరీలు, సీసీ కెమెరాలు, చెత్త సేకరణ వంటి 20 రకాల వసతులు కల్పించేందుకు ప్రతిపాదనలు పంపారు. రూ. 40 కోట్ల వ్యయంతో స్నానపు ఘట్టాలు, వాగుపై రోప్‌వే, శిథిలావస్థలో ఉన్న ఆలయాల పునరుద్ధరణ వంటి పనులు చేపడతారని ఆశించారు. అయితే, ప్రభుత్వం మారడంతో ప్రాధాన్యతలు కూడా మారాయి. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎంపీ మాధవనేని రఘునందన్‌రావులు పలుమార్లు రాష్ట్ర దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖను కలిసి విన్నవించారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో కేంద్రానికి సానుకూల ప్రతిపాదనలు పంపితే 'ప్రసాద్' పథకం తిరిగి ప్రారంభమవుతుందని కోరారు. ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి స్పందన లేదు. సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి విన్నవించాలని కూడా భావిస్తున్నట్లు తెలిసింది.

శిథిలావస్థలో ఉపాలయాలు

కూడవెల్లి రామలింగేశ్వరాలయం శైవ, వైష్ణవ సంప్రదాయాల

మిగతా 8వ పేజీలో

ప్రతిపాదనలు సిద్ధం చేయండి.. సీఎంను కలుస్తా

- దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : రామేశ్వరంపల్లి కూడవెల్లి రామలింగేశ్వరాలయం పునఃనిర్మాణానికి, ఆలయాభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని, ఆలయ అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తే సీఎంను కలిసి నిధులు కోరుతానని ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆలయాన్ని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కివెంకటయ్యతో కలిసి ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. అనంతరం దేవాదాయశాఖ అధికారులతో సమీక్షించారు. దుబ్బాక మున్సిపల్ దుంపలపల్లి వార్డులో డ్వాక్రా మహిళా భవన ప్రహరీ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మున్సిపాలిటీ నుంచి చెత్తబుట్టలను పంపిణీ చేశారు. అలాగే నర్లంగడ్డ, బల్వంతాపూర్, చింతమడక రహదారులను ఆయన పరిశీలించారు.



సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

సిద్దిపేట కల్చరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ 42వ వార్షికోత్సవం వైభవంగా జరిగింది. బుధవారం సిద్దిపేట ఆర్యవైశ్య భవనం కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకము, సామూహిక కుంకుమ పూజలు, చండీ హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా సహస్ర సూర్య చంద్ర దర్శనం చేసుకున్న పెద్దలకు (వెయ్యి అమావాస్యలు, వెయ్యి పౌర్ణమిలు చూసిన వారు...అంటే 82 సంవత్సరాలు పైబడిన వారు) పాదపూజ చేసి, గౌరవ సన్మానం చేశారు. ఈ కార్యక్రమం ఇదే మొదటిసారి అని ఆర్యవైశ్య భవనం అధ్యక్షుడు అయిత బాలరాజేశం, ప్రధాన కార్యదర్శి పోశెట్టి శ్రీకాంత్, కోశాధికారి గంప కృష్ణమూర్తి సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ నాయకులు, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు

అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు

- తప్పిన పెను ప్రమాదం
- ప్రయాణికులు సురక్షితం


అదుపు తప్పి కాల్వలో దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

మునిపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం పెద్దలోడి గ్రామ శివారులో బుధవారం ఓ ఆర్టీసీ బస్సు అదుపు తప్పి కాల్వలోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో బస్సులో సుమారు 60 మంది ప్రయాణికులు ఉండగా, బస్సు సగం రోడ్డుమీదే ఆగిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. రోజు మాదిరిగానే సంగారెడ్డి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు సదాశివపేట నుంచి మక్తక్యాసారం గ్రామానికి బుధవారం ఉదయం వెళ్లి, తిరిగి వస్తోంది. బస్సు పెద్దలోడి గ్రామ శివారుకు రాగా, ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించేందుకు ఆర్టీసీ డ్రైవర్ ప్రయత్నించారు. ఇదే క్రమంలో రోడ్డుపై గుంతలు ఉండటంతో బస్సు అదుపు తప్పి రోడ్డు కిందికి దిగి పోయింది. బస్సును అదుపు చేసేందుకు డ్రైవర్ ఎస్‌కే మహ్మద్ ప్రయత్నిస్తున్న క్రమంలో స్టీరింగ్‌కు ఉండే స్ప్రింగ్ విరిగిపోయింది. దీంతో డ్రైవర్ చేతికి స్వల్పగాయమైంది. బస్సు ప్రమాదానికి గురైన వెంటనే ప్రయాణికులు అందులోంచి దిగిపోయారు. సమాచారం అందుకున్న సంగారెడ్డి డిపో మేనేజర్ ఉపేందర్ వచ్చి వివరాలు సేకరించారు. రోడ్డు సరిగ్గా లేకపోవడం వల్లే ప్రమాదం జరిగిందని డీఎం తెలిపారు. ఆ రూట్‌లో ఒకటే బస్సు ఉండటం.. అది అదుపు తప్పి కాలువలోకి దూసుకువెళ్లడంతో ఆ బస్సు దిగిన ప్రయాణికులు మరో ప్రత్యామ్నాయం లేక ఆటోలు.. ద్విచక్ర వాహనాలపై తగ గమ్య స్థానాలకు వెళ్లిపోయారు.

ఈ రోడెట్ల ఉందిర బావో..

ఏడాదైనా మారని తీరు

మక్తక్యాసారం గ్రామానికి వెళ్లే రోడ్డు పూర్తి గుంతలమయంగా ఉండటంతో గతేడాది ఆగస్టు 23న ఓ ఆర్టీసీ డ్రైవర్ డ్రైవింగ్ చేస్తూనే 'ఈ రోడెట్ల ఉందిర బావో.. మక్తక్యాసారం రోడ్డెప్పుడు మారుతుందిరో మావో' అంటూ పాటందుకున్నాడు. ఓ ప్రయాణికుడు దీనిని వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా.. వైరల్ అయింది. ఈ కథనం ఆంధ్రజ్యోతిలోనూ ప్రచురితమైంది. అయినా, ఇప్పటి వరకు అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ రోడ్డును పట్టించుకోవడం లేదు. ఈ నేపథ్యంలోనే బుధవారం 60 మంది ప్రయాణికులతో వెళ్తున్న బస్సు ప్రమాదానికి గురైంది. బస్సు కాల్వలోకి దూసుకెళ్లి ఆగింది. అదే జరగరానికి జరిగితే పెను ప్రమాదం జరిగేదని చెబుతున్నారు. ఇప్పటికైనా మక్తక్యాసారం రోడ్డును బాగు చేయాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

చేతులు, కాళ్లు కట్టేసి.. నడుముకు బండరాయి కట్టి..

- చెరువులో వ్యక్తి మృతదేహం లభ్యం


ములుగు పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

మద్దూరు/ములుగు, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : మద్దూరు మండలం గాగిల్లాపూర్ గ్రామ శివారులోని చెరువులో బుధవారం సాయంత్రం వ్యక్తి మృతదేహం లభించింది. మృతుడు ములుగు మండల కేంద్రానికి చెందిన తిగుల్ల నెహ్రూ (37)గా పోలీసులు గుర్తించారు. ములుగు ఐకేపీ సెంటర్‌లో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న అతడు సోమవారం పనికని వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అదృశ్యం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. అంతలోనే మద్దూరు మండలం గాగిల్లాపూర్ గ్రామ చెరువులో నెహ్రూ శవమై కనిపించాడు. తాళ్లతో కాళ్లు, చేతులు చుట్టేయడంతో పాటు నడుముకు బండరాయి ఉండి, ఒళ్లంతా కుళ్లిపోయి ఉండటంతో హత్య చేసి ఉంటారన్న అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. చెరువు ఒడ్డుకు మృతదేహం కొట్టుకురావడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో చేర్యాల సీఐ ఎల్.శ్రీను, మద్దూరు ఎస్‌ఐ షేక్ మహబూబ్ అలీ సిబ్బందితో కలిసి ఘటనాస్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. 3 రోజుల క్రితం తన స్నేహితులతో కలిసి కారులో గాగిల్లాపూర్ వైపు వచ్చిన నెహ్రూ చెరువులో విగతజీవిగా మారడం పట్ల తోటి మిత్రుల మధ్య తలెత్తిన విభేదాలే కారణమని చెబుతున్నారు.

కుటుంబ సభ్యులు, గ్రామస్థుల ఆందోళన

నెహ్రూను హత్య చేసిన నిందితులను తమకు అప్పగించాలని డిమాండ్ చేస్తూ కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ములుగు పోలీస్‌స్టేషన్ ఎదుట బుధవారం ఆందోళన నిర్వహించారు. విషయం తెలుసుకున్న గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి అక్కడికి చేరుకొని వారికి నచ్చజెప్పారు. నిందితుడిని పట్టుకొని శిక్షపడేలా చూస్తామని, సంయమనం ఉండాలని కోరడంతో ఆందోళనకారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

108 వాహనంలో మహిళ ప్రసవం


అంబులెన్సు వాహనంలో పండంటి బిడ్డకు జన్మనిచ్చిన తల్లి

చిన్నశంకరంపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): చిన్నశంకరంపేట మండలం చందాపూర్ గ్రామానికి చెందిన విజయ అనే మహిళకు బుధవారం రాత్రి పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్సు వాహనానికి సమాచారం ఇచ్చారు. వెంటనే ఈఎంటీ నవీన్ యాదవ్, పైలెట్ ఆఫీసర్ హరీష్ గర్భిణీని అంబులెన్సులో మెదక్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మార్గమధ్యలో కోంటూర్ గ్రామ శివారులోకి రాగానే పురిటి నొప్పులు ఎక్కువై 108 వాహనంలోనే మగ శిశువుకు జన్మనిచ్చింది. తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారని, మెరుగైన చికిత్స కోసం మాత శిశు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు వారు తెలిపారు. నవీన్ యాదవ్, హరీష్‌ను జిల్లా అధికారులు జానుషోహిద్, కిరన్ అభినందించారు.

ఖేడ్ కార్మిక శాఖ అధికారిపై విచారణ

నారాయణఖేడ్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : నారాయణఖేడ్ కార్మిక శాఖ అధికారి గిరిరాజ్ ప్రతి పనికి ముడుపులు వసూలు చేస్తున్నారని గత నెల 18న పలువురు కార్యాలయం ముందు ఆందోళన చేశారు. ఈ విషయం పత్రికలలో రావడంతో కార్మిక శాఖ అధికారి గిరిరాజ్‌ను ఉన్నతాధికారులు సెలవుపై పంపించారు. ఈ మేరకు డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రావు బుధవారం నారాయణఖేడ్ కార్యాలయంలో ఆయనపై విచారణ జరిపారు. పలువురు లబ్ధిదారులు తమ నుంచి వివిధ పనుల కోసం ముడుపులు తీసుకున్నట్లు ఫిర్యాదు చేయడమే కాకుండా, పనులు చేయకుండా కార్యాలయం చుట్టూ తిప్పుకున్నాడని ఆధారాలు కూడా చూపించారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని ఆయన తెలిపారు.


విచారణ జరుపుతున్న డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రావు

రెండు బైకులు ఢీ.. ఇద్దరికి గాయాలు

- ఒకరి పరిస్థితి విషమం



గాయ పడ్డ సాయిబాబా, నాగరాజు

పాపన్నపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని నార్సింగి శివారులో బుధవారం సాయంత్రం రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులకు గాయాలు కాగా, అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. పాపన్నపేట పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మల్లంపేటకు చెందిన వుట్టి నాగరాజు నార్సింగిలో చేపలు అమ్ముకొని బైక్‌పై పాపన్నపేట వస్తున్నాడు. శంకరంపేట మండలం దానంపల్లికి చెందిన నర్ర సాయిబాబ మెదక్ నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో నార్సింగి శివారులో దారిదేవుని ఆలయ సమీపంలో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో మల్లంపేటకు చెందిన వుట్టి నాగరాజు తలకు గాయాలు కాగా అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. సాయిబాబా కాలు విరిగింది. వీరిని 108 వాహనంలో మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

సాయిబాబా ఆలయంలో చోరీ

- హుండీ ధ్వంసం, నగదు అపహరణ


దుండగులు ధ్వంసం చేసిన హుండీ

నర్సాపూర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ పట్టణంలోని ఎన్‌జీవో కాలనీలో ఉన్న సాయిబాబా ఆలయంలో దొంగలు హుండీని ధ్వంసం చేసి అందులోని నగదును అపహరించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్ బుధవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం సాయంత్రం పూజారి ఆలయానికి తాళం వేసి వెళ్లగా, బుధవారం ఉదయం తాళం పగులగొట్టి ఉండటాన్ని గుర్తించారు. దొంగలు ఆలయంలోకి దూరి హుండీని ధ్వంసం చేయడంతో పాటు కొన్ని ఇతర వస్తువులను అపహరించారు. సీసీ కెమెరాలకు సంబంధించిన వైర్లు కూడా కట్ చేశారు. హుండీలో సుమారు రూ.40వేల నగదు ఉండవచ్చని ఆలయ కమిటీ అధ్యక్షుడు తెలిపారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య


అంజయ్య(ఫైల్)

సిద్దిపేట రూరల్,జూలై 30(ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధతో వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సిద్దిపేట రూరల్ మండలం చింతమడక గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గుండేల్లి అంజయ్య (44) గత పంవత్సరం అప్పులు చేసి బిడ్డ పెళ్లి చేశాడు. అప్పటినుంచి ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నాడు. చేసిన అప్పుల గురించి తనలోతాను బాధపడేవాడు. తన భార్య అమ్మగారింటి దగ్గర నుంచి తీసుకువస్తాను అని ధైర్యం చెప్పి తల్లిగారింటికి వెళ్లింది. అప్పులు ఏలా తీర్చాలని మనస్తాపనికి గురై వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య గుండేల్లి కనకవ్వ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గంజాయి అక్రమ రవాణా కేసులో జైలు శిక్ష, జరిమానా

జహీరాబాద్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : గంజాయి అక్రమ రవాణాకు పాల్పడిన కేసులో ముంబయికి చెందిన నట్రాజ్‌హాన్సేన్‌కు సంగారెడ్డి జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి బుధవారం జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారని ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం ముంబయికి చెందిన నట్రాజ్ హాన్సేన్ 2020 సంవత్సరంలో 16 కిలోల గంజాయిని ముంబాయి నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్న క్రమంలో అప్పట్లో ఎక్సైజ్ పోలీసులు కోహీర్ మండలంలోని కవెలి చౌరస్తా వద్ద వాహనాల తనిఖీలు చేస్తున్న క్రమంలో పట్టుబడ్డాడన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు సంగారెడ్డి జిల్లా కోర్టులో విచారణ కొనసాగిందన్నారు. గంజాయి తరలిస్తున్న విషయం వాస్తవమేనని తేలడంతో సంగారెడ్డి జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి జయంతి నిందితుడికి 5 సంవత్సరాల జైలు శిక్ష, రూ.25 వేల జరిమానా విధించినట్లు ఆయన వివరించారు.

ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

దుబ్బాక, జూలై30(ఆంధ్రజ్యోతి): దుబ్బాక మండలం ఆకారం గ్రామశివారులో బుధవారం పేకాటస్థావరంపై దాడిచేసి ఏడుగురిని అరెస్టు చేసినట్టు దుబ్బాక ఎస్‌ఐ కీర్తిరాజు తెలిపారు. వారి నుంచి నాలుగు ద్విచక్రవాహనాలు, రూ.36,286లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ కీర్తిరాజు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ ప్రీప్రైమరీ స్కూళ్లు

పంద్రాగస్టు నుంచి ప్రారంభానికి ఆదేశాలు జారీ

- ఉమ్మడి జిల్లాలో 106 ప్రభుత్వ పాఠశాలలు ఎంపిక
- బడ్జెట్ విడుదల, ఆయా, బోధకుల నియామకం



తూప్రాన్‌లో ప్రీప్రైమరీ తరగతులకు ఎంపికైన పాఠశాల

తూప్రాన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలని ప్రభుత్వం కృషి చేస్తోంది. అందులో భాగంగా ఇప్పటికే ఆంగ్ల మాధ్యమ బోధనను అందిస్తుండగా, ఇప్పుడు, ప్రైవేటు పాఠశాలల మాదిరిగా ప్రీప్రైమరీ విద్యను ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులు నిర్వహించాలని స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్ ఈ నెల 26న ఆదేశాలు జారీ చేశారు.

ఉమ్మడి జిల్లాలో 106..

రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతలో 1000 ప్రభుత్వ పాఠశాలల్లో దీన్ని అమలు చేయనున్నారు. 210 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీప్రైమరీ విభాగాల ప్రారంభానికి అనుమతులు మంజూరు చేయగా, మరో 790 ప్రభుత్వ పాఠశాలలను గుర్తించి ప్రారంభించేందుకు అనుమతులు ఇచ్చారు. ఆగస్టు 15 నుంచి తరగతులు ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా 106 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులు ప్రారంభం కానున్నాయి. మెదక్ జిల్లాలో 27, సంగారెడ్డి జిల్లాలో 59, సిద్దిపేట జిల్లాలో 20 ప్రభుత్వ పాఠశాలలతో ప్రీప్రైమరీ విభాగాలు ఏర్పాటు కానున్నాయి.

నిధులు మంజూరు..

స్కూల్ ఎడ్యుకేషన్, సమగ్ర శిక్షా, ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ విభాగాలు పరిశీలన అనంతరం ప్రీప్రైమరీ బోధనల అమలుకు అనుమతించాయి. ఇందుకోసం రూ. 3307.23 లక్షల బడ్జెట్‌కు అనుమతి లభించగా, రూ.2262.83 లక్షలు మంజూరు చేస్తూ ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ యోగితారాణా ఆదేశాలు జారీ చేశారు. ప్రీప్రైమరీ పాఠశాల నిర్వహణకు బోధకుడు (ఇన్‌స్ట్రక్టర్), ఆయాను నియమించాలని సూచించారు. ఆయా పోస్టుకు 7వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, బోధకుడి పోస్టుకు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఉండాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. 10 నెలల పాటు గౌరవ వేతనం చెల్లించనుండగా, ఆయాకు రూ.6 వేలు, బోధకుడికి రూ. 8వేలు చెల్లించనున్నారు. నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు నిర్వహించనున్నారు. మహిళా అభివృద్ధి అండ్ శిశు సంక్షేమ శాఖ, ఆరోగ్య, వైద్య అండ్ కుటుంబ సంక్షేమ శాఖల సమన్వయంతో వీటిని నిర్వహించనున్నారు. విద్యార్థులు ప్రీప్రైమరీలో చేరగానే యూడైస్ పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.

సకల సౌకర్యాలతో..

ప్రీప్రైమరీ విభాగానికి ప్రత్యేక తరగతి గదిని కేటాయించాలని, అనుకూలమైన ఫర్నిచర్, తగినంత ప్రదర్శన, నిల్వ స్థలాలు ఉండాలని, సరైన వెంటిలేషన్ (వెలుతురు), సహజ లైటింగ్ అమర్చబడి ఉండాలని సూచించారు. భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా తరగతి గది ఆకర్షణీయంగా ఉండాలని, విద్యాపరంగా అలంకరించాలని సూచించారు. అనుకూలమైన పారిశుధ్య సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. విద్యార్థుల వయసుకు తగ్గట్టుగా అభివృద్ధి స్థాయికి ఇండోర్, అవుట్‌డోర్ ఆట వస్తువులు పాఠశాలలో అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. ప్రీప్రైమరీ విద్యార్థులు నిద్రపోయే స్థలం అందుబాటులో ఉండాలని వివరించారు. పారిశుధ్య నిర్వహణ గ్రామ పంచాయతీ సమన్వయంతో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలపై ఉంటుందని వివరించారు.

ప్రీప్రైమరీకి ఎంపికైన పాఠశాలలు

మెదక్ జిల్లా :
వెంకటాపూర్ (కే), ఎస్ కొండాపూర్, చిట్యాల, ఆర్కెల, తొగుట, హవేళిఘనపూర్ (ఎల్‌టీ), మానేపల్లి, తిప్పనగుల్ల, శాలిపేట, బూర్గుపల్లి, ఫరీద్‌పూర్, కూసంగి, శివాయపల్లి, పీర్యాతండా, దేశ్యా తండా, కాట్రియల్, ముట్రాజ్‌పల్లి, గుండ్రెడ్డిపల్లి, నందగోకుల్, రజాక్‌పల్లి, కొడిపల్లి, మల్లెపల్లి, ప్యాటగడ్డ, ఆరేపల్లి, తూప్రాన్, నర్సాపూర్, రామాయంపేట ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు.

సంగారెడ్డి జిల్లా :
సంజీవన్‌రావుపేట, డెగుల్‌వాడీ, బిడెకన్న, ఎస్ఎన్ కాలనీ, మేడికుంద, చిన్నహైదరాబాద్, చింతలచెర్వు, జిన్నారం, క్యాసారం, కంకోల్ (యూఎం), పస్తాపూర్ (టీఎం), బుదేర కాలనీ (టీఎం), మునిదేవునిపల్లి, సాదుల్లానగర్, బాచెపల్లి, చల్లగిద్ద టీ, గాంధీనగర్, మంబాపూర్, మిర్జాపూర్ (ఎన్), ఇస్మాయిల్‌ఖాన్‌పేట్, సాదు తండా (జంగిబుర్గ్ కలాన్), ధర్మాపూర్, మద్రి, మాచిరెడ్డిపల్లి, చందాపూర్, కల్హేర్ హెచ్‌డబ్ల్యు, రుద్రారం, వావిలాల, లోనికుర్దు, వెల్టూర్, శంకాపూర్, అంగడిపేట, తాడ్దాన్‌పల్లి, ఆనంతసాగర్, చాప్టాకిటీ, మల్కారేగడి టీ, బ్యాతోల్, కొత్తగూడెం, అలిఖాన్‌పల్లి, బోరేగాన్, కొత్తపల్లి ఎన్, ఉట్‌పల్లి, బడంపేట్, ఇంద్రానగర్, ఇసోజిపేట, మగ్దుంపూర్, చింగెపల్లి, సీతారాంకుంట, బీరంగూడ, ఇస్నాపూర్, చిట్కుల్ వడ్డెరకాలనీ, బొల్లారం (అర్బన్), సంగారెడ్డి (బాలికల), పటాన్‌చెరు (టీఎన్), తెల్లాపూర్, రాంచంద్రాపురం, పటాన్‌చెరు (బాలికలు), ఆమీన్‌పూర్, పల్వట్ల పాఠశాలలు.

సిద్దిపేట జిల్లా :
సంగుపల్లి, దొమ్మాట, రాంసాగర్, జబ్బాపూర్, మాదారం, పోతారం జే, వీరారెడ్డిపల్లి, లింగారెడ్డిపల్లి, కోనాయపల్లి, దాసర్లపల్లి, గణేష్‌పల్లి, పోరెడ్డిపల్లి, ఉమ్మాపూర్, తీగుల్ నర్సాపూర్, కోనాపూర్, మాటిండ్ల, బాషగూడెం, తాణేదార్‌పల్లి, పల్లెపహాడ్, ఏటిగడ్డ కిష్టాపూర్ బడులు.

పాఠశాల ఎంపిక సంతోషం..



ప్రీప్రైమరీ తరగతుల బోధనకు తూప్రాన్ ప్రాథమిక పాఠశాల ఎంపిక కావడం సంతోషకరం. ప్రభుత్వ పాఠశాలల్లోనూ నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విద్య ప్రైవేటు పాఠశాలలకు దీటుగా అమలు కానున్నది.

\- పట్లూరి లక్ష్మణ్, హెచ్‌ఎం తూప్రాన్



ఢిల్లీలో రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్నకు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ రఘునందన్ రావు, నాయకులు

శంకర్‌పల్లిలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగేలా చూడండి

- రైల్వేశాఖ సహాయ మంత్రికి ఎంపీ వినతి

కంది/అమీన్‌పూర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాకు అతి చేరువలో ఉన్న శంకర్‌పల్లి రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లన్నీ ఆగేలా చూడాలని బుధవారం ఢిల్లీలో రైల్వే శాఖ కేంద్ర సహాయ మంత్రి సోమన్నకు ఎంపీ రఘునందన్‌రావు వినతిపత్రం అందజేశారు. బుధవారం ఉదయం ఢిల్లీలోని రైల్వే శాఖ సహాయ మంత్రి కార్యాలయంలో ఆ శాఖ సహాయ మంత్రి సోమన్నను రఘునందన్‌రావు, బీజేపీ నాయకులు నల్ల నర్సింహారెడ్డి, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఉద్యోగులు బాలనర్సయ్య, రవి, ఈశ్వరయ్య, ప్రభు, శివకుమార్, కంది శ్రీనివాస్, ప్రదీప్ కుమార్‌లతో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన సంగారెడ్డి జిల్లా వాసులకు, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఉద్యోగులకు ప్రయాణం సులభతరం చేయడానికి వీలుగా శంకర్‌పల్లిలో ప్రతి ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. శంకర్‌పల్లిలో మచిలీపట్నం బీదర్ ఎక్స్‌ప్రెస్, హుస్సేన్ సాగర్, రాయచూర్, హుబ్లీ, ముంబై, విశాఖపట్నం, విజయపూర్ణ ఎక్స్‌ప్రెస్‌లు ఆగడం లేదని, వాటిని ఇక్కడ ఆపేలా చూడాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్న ఈ విషయాన్ని రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో చర్చించి త్వరలోనే ఒక నిర్ణయానికి వస్తామని తెలిపారు.

'ఆపరేషన్ సిందూర్' వ్యతిరేక కథనాలపై ఫిర్యాదు

పటాన్‌చెరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ సిందూర్‌పై తెలుగు పత్రికల్లో వచ్చిన వ్యతిరేక కథనాలపై ఎంపీ రఘునందన్‌రావు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బుధవారం ఢిల్లీలోని పార్లమెంటు భవనంలో వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్ నిర్వహించిన భారత సైన్యానికి వ్యతిరేకంగా తెలుగు పత్రికలు రాయడం దారుణమన్నారు.

రేషన్‌కార్డులు ప్రజల చిరకాల కోరిక

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



చిత్రియాల గ్రామంలో లబ్ధిదారులకు రేషన్ కార్డులు అందిస్తున్న కలెక్టర్

పాపన్నపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురు చూసిన ప్రజల చిరకాల కోరిక నెరవేరిందని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. మండలంలోని గాజుల గూడెం, చిత్రాల గ్రామాల్లో ఆర్డీవో రమాదేవి, తహసీల్దార్ సతీష్‌కుమార్‌లతో కలిసి బుధవారం లబ్ధిదారులకు రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా మొత్తం 9964 కొత్త రేషన్ కార్డులను మంజూరు చేశామని అన్నారు. ఇందులో 34,730 మంది సభ్యుల పేర్లు నమోదు చేసి, మొత్తం జిల్లాలో 44,694 మందికి కొత్త రేషన్ కార్డుల ద్వారా లబ్ధి చేకూర్చామని వివరించారు. పాపన్నపేట మండలం కొత్తగా 479 రేషన్ కార్డులను మంజూరు చేశామని వివరించారు.

హవేళిఘనపూర్‌లో..

హవేళిఘనపూర్/మెదక్ అర్బన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ రేషన్ కార్డులు అందిస్తున్నట్లు మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని కూచన్‌పల్లిలో నూతన రేషన్ కార్డులు పంపిణీ, ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం, పశు వైద్యశాలను పరిశీలించారు. మండలంలో కొత్తగా 650 రేషన్ కార్డులు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో మెదక్ ఆర్డీవో రమాదేవి, తహసీల్దార్ సింధు రేణుక ఉన్నారు. అలాగే బుధవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి యాంటీ డ్రగ్ కమిటీ సమన్వయ సమావేశంలో ఎస్పీ డీవీ శ్రీనివాసరావుతోటు వివిధ జిల్లా అధికారులతో ఆయన సమీక్షించారు. మెదక్ జిల్లాను మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ పిలుపునిచ్చారు.

'ఆంధ్రజ్యోతి' క్లిప్పింగ్‌లు చూపుతూ అవగాహన



విద్యార్థులకు పేపర్ క్లిప్పింగులు చూపుతూ అవగాహన చేస్తున్న టీచర్

రామాయంపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రజ్యోతి మెయిన్‌లో బుధవారం ప్రచురితమైన 'మాసాయిపేట రైలు దుర్ఘటనపై.. నాలుగో తరగతిలో పాఠ్యాంశం' కథనం క్లిప్పింగులను చూపిస్తూ విద్యార్థులకు అవగాహన కల్పించారు. మెదక్ జిల్లా రామాయంపేటలోని ఓ ప్రైవేట్ స్కూల్లో నాలుగో తరగతి విద్యార్థులకు ఆపద సమయాల్లో ధైర్య సాహసాలపై పలు సూచనలు చేశారు ఉపాధ్యాయులు. 11 ఏళ్ల క్రితం మాసాయిపేట వద్ద రైల్వే ట్రాక్‌పై జరిగిన ఈ ఘటనలో తోటి వారి ప్రాణాలు కాపాడిన సాహస బాలిక రుచిత సాహసాన్ని చెప్పారు. దుర్ఘటనలు జరిగినప్పుడు తమను రక్షించుకునే ప్రయత్నాల్లో మీరూ తెలివి ప్రదర్శించాలని చెప్పారు. ఆ ఒక్క క్షణం సాహసం మనతో పాటు కొన్ని ప్రాణాలు, ఆస్తులు కాపాడ వచ్చంటూ విద్యార్థులకు సూచించారు. ఆరోజు స్కూల్ బస్సులో తోటి స్టూడెంట్స్‌తో ప్రయాణిస్తున్న రుచిత భయపడకుండా రైలు ప్రమాద బారి నుంచి ఇద్దరిని కాపాడి ఆమె కూడా కిటికీలోంచి దూకేసిందన్నారు.

మూడు గంటలకే మూత పడిన ప్రభుత్వ బడి

- దెగుల్‌వాడిలో తల్లిదండ్రుల ఆందోళన



మూడు గంటలకే మూసి ఉన్న ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల

కంగ్టి, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని దెగుల్‌వాడి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల బుధవారం మధ్యాహ్నం 3 గంటలకే మూతపడటంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగాల్సిన పాఠశాల ముందుగానే మూసివేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత కొంతకాలంగా పాఠశాల హెచ్‌ఎం రేఖారాణి పనితీరుపై గ్రామస్థులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా మార్పు లేదని తెలిపారు. బుధవారం మధ్యాహ్నం 2.30 గంటలకే ప్రధానోపాధ్యాయురాలు రేఖారాణి పాఠశాల నుంచి వెళ్లిపోవడంతో, మిగతా ఉపాధ్యాయులూ వెళ్లిపోయారు. పిల్లలంతా మూడు గంటలకే ఇళ్లకు రావడంతో విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకొని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనియెడల ఆందోళన తీవ్రం చేస్తామని హెచ్చరించారు. ఈ విషయమై ఎంఈవో రహీమోద్దీన్‌ను వివరణ కోరగా, దెగుల్‌వాడి పాఠశాల మధ్యాహ్నం 3 గంటలకే మూతపడినట్లు తన దృష్టికి వచ్చిందని, విచారణ చేపట్టి నివేదిక ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు.

ప్రపంచ న్యూరో కాంగ్రెస్‌కు డా.కృష్ణమూర్తికి ఆహ్వానం



డా.కృష్ణమూర్తి

సంగారెడ్డి అర్బన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి చౌరస్తాలోని హోప్ న్యూరో అండ్ కార్డియాక్ హాస్పిటల్ చైర్మన్ డా.టి. కృష్ణమూర్తికి దుబాయ్‌లో డిసెంబర్ 1 నుంచి 5 వరకు జరగనున్న 19వ ప్రపంచ న్యూరో సమావేశాలకు ఆహ్వానం అందింది. వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ న్యూరాలజికల్ సొసైటీస్ ఆధ్వర్యంలో జరిగే ఈ ప్రతిష్ఠాత్మక ప్రపంచ న్యూరో కాంగ్రెస్‌కు ప్రముఖ న్యూరో సర్జన్ ఎంపిక కావడం విశేషం. ఈ సందర్భంగా డా. కృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రపంచ సమావేశాలలో తన పరిశోధన పత్రాన్ని సమర్పించనున్నట్లు తెలిపారు. ప్రపంచ నలుమూలల నుంచి న్యూరో వైద్యులు పాల్గొనే ఈ సమావేశాలలో అత్యాధునిక వైద్య సేవలు, నూతన పరిశోధనలు, వాటి ఫలితాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని వైద్య రంగానికి జోడించడం వంటి అంశాలపై చర్చిస్తారన్నారు. పట్టణ స్థాయి నుంచి ప్రపంచ వేదికలపై ప్రసంగించడం అభినందనీయమని హోప్ హాస్పిటల్ సిబ్బంది, శ్రేయోభిలాషులు కొనియాడారు.

ఢిల్లీకి చేరిన 'ఆంధ్రజ్యోతి' కథనం

- కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లిన ఏఎంసీ మాజీ చైర్మన్
- జోగిపేట పోస్టాఫీస్‌కు నిధులిస్తామని హామీ
- అప్పటికప్పుడే అధికారులకు ఆదేశాలు



కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌కు 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనాన్ని చూపిస్తున్న గంగా జోగినాథ్ దంపతులు

జోగిపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): శిథిలావస్థకు చేరిన జోగిపేట పోస్టాఫీసు దుస్థితిపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన కథనం ఢిల్లీకి చేరింది. బుధవారం ఆంధ్రజ్యోతిలో 'తపాలా.. నిర్లక్ష్యమేలా' శీర్షికతో బుధవారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ కథనాన్ని ప్రస్తుతం ఢిల్లీలోనే ఉన్న జోగిపేట ఏఎంసీ మాజీ చైర్మన్, జోగిపేట రైల్వే సాధన సమితి కన్వీనర్ గంగా జోగినాథ్ గుప్తా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సిఫారసు, ఏపీ టీడీపీ సీనియర్ నాయకుడు వెలగపూడి గోపాల క్రిష్ణ ప్రసాద్ సహకారంతో కేంద్ర పోస్టల్, టెలీకమ్యూనికేషన్ల శాఖ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌ను గంగా జోగినాత్ గుప్తా తన సతీమణితోపాటు కలిశారు. ఈ సందర్భంగా జోగిపేట పోస్టల్ భవనం చరిత్ర, అందిస్తోన్న సేవలు, వివరించి, ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనాన్ని చూపించారు. నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. దీంతో స్పందించిన కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ జోగిపేట పోస్టల్ భవన నిర్మాణానికి హామీ నివ్వడంతో పాటు, నిధుల విడుదల కోసం సంబంధిత అధికారులను అప్పటికప్పుడే ఆదేశించారని గంగా జోగినాథ్ తెలిపారు.

ఖేడ్‌లో కాశీ జగద్గురుకు ఘన స్వాగతం



జగద్గురు చంద్రశేఖర స్వామికి పాదపూజ చేస్తున్న భక్తులు

నారాయణఖేడ్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : ధర్మ మార్గమే ప్రతి ఒక్కరికి మోక్ష మార్గమని కాశీ జగద్గురు చంద్రశేఖర శివాచార్య మహాస్వామి అన్నారు. బుధవారం మొట్టమొదటిసారిగా కాశీ జగద్గురు సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌కు రావడంతో ఆయనకు స్థానిక జంగమ లింగాయత్ సమాజ్ బాధ్యులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కట్టమైసమ్మ ఆలయం నుంచి బసవ మంటపం వరకు ప్రత్యేక రథంలో స్వామి వారిని కూర్చోబెట్టి శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం బసవ మంటపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎక్కడైతే ధర్మం ఉంటుందో ఆ ప్రాంతం సుఖశాంతులతో సుభిక్షంగా ఉంటుందన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ ధర్మ మార్గంలో నడుచుకోవడమే కాకుండా భక్తి మార్గాన్ని కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో భర్దీపూర్ ఆశ్రమ పీఠాధిపతి డాక్టర్ సిద్ధేశ్వర్ స్వామి, పంచగామ పీఠాధిపతి కాశీనాథ్ బాబా, ధనశ్రీ పీఠాధిపతి వీరేశ్వర్ స్వామి, బార్సి పీఠాధిపతి మణికంఠ శివాచార్యతో పాటు జంగమ, లింగాయత్ సమాజ్ బాధ్యులు పాల్గొన్నారు. స్వామీజీకి స్వాగతం చెప్పిన వారిలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, టీపీసీసీ సభ్యులు శంకరయ్య స్వామి, సిద్ధయ్య స్వామి, విజయ్‌కుమార్ స్వామి, నరేష్ స్వామి, శంకరప్ప, రేవణయ్య స్వామి, రమేష్, జగదీశ, మన్మథ కిశోర్, ఆనంద్, బస్వరాజ్, వీరశెట్టి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గృహంలో జగద్గురుకు పాదపూజ

కాశీ జగద్గురు చంద్రశేఖర శివాచార్య బుధవారం సాయంత్రం స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డి స్వగృహానికి వచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సతీమణి అనుపమ్మరెడ్డి, మాతృమూర్తి గాలెమ్మ, సోదరుడు సుధాకర్ రెడ్డి, కుటుంబ సభ్యులు పాదపూజ చేసి స్వామి ఆశీస్సులు పొందారు.

విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలి

- మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు



మెదక్ పట్టణ పోలీసు స్టేషన్‌లో ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

మెదక్ అర్బన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు సూచించారు. బుధవారం పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మిక తనిఖీ చేశారు. పోలీసుల విధులు, రిజిస్టర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గంజాయి, గేమింగ్, పేకాట, బెట్టింగ్, గంబ్లింగ్ తదితర వాటిపై నిఘా పెట్టాలన్నారు. కేసుల నమోదు జాప్యం చేయొద్దన్నారు. సమాచార వ్యవస్థను పటిష్ఠం చేసుకొని, అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెట్టాలన్నారు. రానున్న ఎన్నికల్లో అప్రమత్తంగా విధులు నిర్వర్తించి, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టాలన్నారు. బీట్ సిస్టం, పెట్రోలింగ్, డయల్ 100పై పలు సూచనలు చేస్తూ.. నేరాల నియంత్రణకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐ మహేష్ పాల్గొన్నారు.

పార్క్‌లో చెట్లు నరికేశారు..



పట్టణంలోని హౌజింగ్‌బోర్డు పార్కులో చెట్లు నరికివేతకు గురైన దృశ్యం

జహీరాబాద్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీ పార్క్‌లో చెట్లను నరకడం వివాదాస్పదమైంది. మంగళ, బుధవారాల్లో పార్క్‌లోని పెద్ద పెద్ద చెట్లను నరికేశారు. ఈ విషయాన్ని స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు వచ్చి నరికేసిన చెట్లను పరిశీలించించి, ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. నిబంధల ప్రకారం పార్క్‌లో చెట్లను తొలగించాలంటే మున్సిపల్, అటవీ శాఖ అధికారుల అనుమతులు తప్పని సరి. అవేవీ లేకుండా విద్యుత్ తీగలకు తగుతున్నాయనే నెపంతో విద్యుత్ శాఖ పెద్ద పెద్ద చెట్లను నరికి వేసిందనిస్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ తీగలకు తగులుతున్నాయని విద్యుత్ అధికారులు కొమ్మలు తొలగించకుండా ఏకంగా చెట్లనే నరికి వేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై అటవీశాఖ అధికారులను సంప్రదించగా, అనుమతులు తీసుకోలేదని.. విద్యుత్ అధికారులకు నోటీసులు జారీ చేస్తామన్నారు. మున్సిపల్ కమిషనర్ సుభాష్‌రావును సంప్రదించగా, గుర్తు తెలియని వ్యక్తులు చెట్లను నరికి వేశారని వారిపై పోలీసులకు ఫిర్యాదు చేశామని చెప్పారు. విద్యుత్ ఏడీఏ మధుసూదన్‌ను అడగగా, విద్యుతజ్ తీగలకు తగిలితే చెట్ల కొమ్మలను, చెట్లను తొలగించమని చెప్పారు.

బతికుండగానే పౌతితో భూమి కాజేత

- పోలీస్‌స్టేషన్‌లో బాధితుడి ఫిర్యాదు



పౌతిలో పట్టేదారుకు కొడుకుగా చూపిన దృశ్యం

మద్దూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ అధికారుల అండదండలతో తప్పుడు మరణ ధ్రువీకరణ పత్రాన్ని సృష్టించి ధరణిలో వారసత్వం (పౌతి) పేరిట భూమి కాజేసిన సంఘటన దూళిమిట్ట మండలంలోని బెక్కల్ గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడు తుజలాపురం మొండయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మొండయ్య జీవనోపాధి కోసం హైదరాబాద్‌కు వలసవెళ్లి అమీన్‌పూర్‌లో ఇస్త్రీ షాపు నడుపుకుంటున్నాడు. ఇదే అదునుగా భావించిన తన పెద్దనాన్న కుమారుడు తుజలాపురం రాములు తాను చనిపోయినట్లు తప్పుడు ధ్రువపత్రాన్ని సృష్టించి తహసీల్దారుతో కుమ్మక్కై ఆగస్టు 14, 2024న తనకు చెందిన 1.0550 గుంటల భూమిని అతడి పేరున పట్టా చేయించుకున్నాడు. ఇటీవల భూ భారతిలో గ్రామంలోని కొందరు వివిధ భూ సమస్యలపై దరఖాస్తులు చేసుకుంటున్నట్లు తెలుసుకున్నానని మొండయ్య.. 1బీ పహాణీ తీసుకోగా భూమి తక్కువగా చూపించడంతో కంగుతిన్నాడు. ఈ విషయమై తహసిల్దారు కార్యాలయంలో సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసుకోగా అసంపూర్తి సమాచారాన్ని ఇచ్చారని తెలిపారు. చివరకు తన పెద్దనాన్న కుమారుడు తుజలాపురం రాములు వారసత్వం పేరిట తన భూమికి ఇతర గ్రామంలోని వ్యక్తులచే సాక్షి సంతకాలు పెట్టించి కాజేసినట్లు తెలిసిందన్నారు. అంతేకాకుండా మార్చి 11, 2025న ఈ భూమిని అతడి భార్య పేరున రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిపారు. ఈ విషయమై బాధితుడు మద్దూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు తాను బతికే ఉన్నానని, తనకు న్యాయం చేయాలని కోరారు. అంతేకాకుండా తన భూమి కాజేసిన తుజలాపురం రాములుతో పాటు ఎలాంటి విచారణ చేయకుండా రిజిస్ట్రేషన్ చేసిన తహసీల్దారు శ్యామ్‌పై చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఈ విషయమై ప్రస్తుత తహసీల్దార్ మధుసూధన్ వివరణ కోరగా గత తహసీల్దారు చేసిన రిజిస్ట్రేషన్ సమయంలో కుటుంబ సభ్యుల అంగీకారంతో పాటు, డెత్ సర్టిఫికెట్ లేకుండా ఉందని, దీనిపై విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

మంత్రి వివేక్‌వి అవివేక మాటలు

● బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వేలేటి రాధాకృష్ణశర్మ


సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వేలేటి రాధాకృష్ణశర్మ

సిద్దిపేట జూలై 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి, ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ సిద్దిపేట జిల్లాపై కనీస అవగాహన లేకుండా మాట్లాడటం చాలా బాధాకరమని, అలాంటి వ్యక్తి జిల్లాకు ఇన్‌చార్జి మంత్రిగా ఉండటం ప్రజల దురదృష్టంగా భావిస్తున్నట్లు బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ శర్మ తెలిపారు. బుధవారం సిద్దిపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గుండు భూపేష్, మోహన్‌లాల్, కాముని శ్రీనివాస్‌లతో కలిసి రాధకృష్ణశర్మ మాట్లాడుతూ.. రెండు సార్లు సిద్దిపేటకు వచ్చిన మంత్రి వివేక్ మొదటగా సిద్దిపేటకు వెయ్యి పడకల ఆసుపత్రి అవసరమా అని, రెండవ సారి వచ్చినపుడు మల్లన్నసాగర్ వృథా అని మాట్లాడటం చూస్తుంటే జిల్లా అభివృద్ధి చేయడానికి వస్తున్నాడా, లేదంటే అభివృద్ధి నిరోధకుడిగా వస్తున్నాడా అని ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. సిద్దిపేట జిల్లా ఇన్‌చారి మంత్రిగా వస్తే అవసరాలు తీరుతాయని జిల్లా ప్రజలు ఆశపడ్డారని, కానీ ఆయన మాటలు చూస్తుంటే జిల్లా ప్రజలపై కక్ష సాధింపు ధోరణితో వస్తున్నట్లు స్పష్టంగా అర్థమౌతుంది. ఈ కార్యక్రమంలో నాయకులు కోల రమేష్, కనకరాజు, ఎడ్ల సోమిరెడ్డి, పాపయ్య, వెంకటేశం, ఎర్ర యాదయ్య, జంగిటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల బిల్లుకు బీజేపీ వ్యతిరేకం

చేర్యాల, జూలై 30(ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల బిల్లుకు కేంద్రప్రభుత్వం మోకాలడ్డుతుండటం తగదని, బీసీ ప్రధానమంత్రిని అని చెబుతున్న ప్రధాని నరేంద్రమోదీ పార్లమెంటులో బీసీ బిల్లు ఎందుకు ప్రవేశపెట్టడం లేదో జవాబివ్వాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు టి.సైలాబ్‌బాబు అన్నారు. చేర్యాల పట్టణంలోని వాసవీగార్డెన్స్‌లో బుధవారం చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల పార్టీ కార్యకర్తల రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్రప్రభుత్వం విద్వేషాలు రెచ్చగొట్టి కుల,మతాలలమధ్య చిచ్చుపెడుతూ దేశప్రజల ఐక్యతను దెబ్బతీస్తుందన్నారు. బీసీ రిజర్వేషన్ల బిల్లు విషయంలో బీజేపీ బలహీనవర్గాలకు బద్ధశత్రువుగా వ్యవహరిస్తుందని, ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా పార్లమెంటులో బిల్లు ఆమోదించాలని డిమాండ్‌చేశారు. జిల్లాలో రైతాంగానికియూరియా కొరత ఏర్పడినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకుండా పరస్పర విద్వేషపూరితమైన విధానాలు అవలంబిస్తున్నాయన్నారు.

ఆంగ్లభాషలో పట్టుసాధించాలి

మద్దూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఆంగ్లభాషలో పట్టుసాధించాలని జిల్లా రీసోర్స్ పర్సన్ పంజ రాజమల్లు అన్నారు. మద్దూరు మండలం రేబర్తి ఉన్నత పాఠశాలలో బుధవారం చేర్యాల, మద్దూరు మండలాల ఆంగ్ల ఉపాధ్యాయుల స్కూల్‌కాంప్లెక్స్ సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పోటీతత్వసమాజానికి ధీటుగా విద్యార్థులు ఆంగ్ల భాషా పరిజ్ఞానం పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగడంలో ఆంగ్లభాష తోడ్పాటునందిస్తుందన్నారు.

ఆలయం కూల్చివేతకు నిరసనగా ర్యాలీ


పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన హిందూ మత ప్రతినిధులు

కుకునూరుపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ పెద్దమ్మ దేవాలయం కూల్చివేతకు నిరసనగా హిందూ మత ప్రతినిదులు బుధవారం మండల కేంద్రంలో బైక్‌ర్యాలీ నిర్వహించి అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జూబ్లీహిల్స్‌లోని దేవాలయం కూల్చివేసి అందులో ఉన్న అమ్మవారిని ఎతుకెళ్లిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, అదే స్థలంలోనే మళ్లీ విగ్రహాన్ని , దేవాలయాన్ని పునర్నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, హిందూ ప్రతినిధులు పాల్గొన్నారు.

స్నేహితుడి తల్లి అంత్యక్రియలకు ఆర్థిక సాయం

రాయపోల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రాయపోల్ మండలం అనాజీపూర్ గ్రామానికి చెందిన మంగలి బిక్షపతి కొన్నేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం బిక్షపతి తల్లి లక్ష్మమ్మ అనారోగ్యంతో మృతి చెందగా బిక్షపతి చిన్ననాటి స్నేహితులు స్పందించారు. లక్ష్మమ్మ అంత్యక్రియల కోసం బుధవారం బాధిత కుటుంబ సభ్యులకు పదివేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. గ్రామానికి చెందిన జ్ఞాన సేవ ఫౌండేషన్ ప్రతినిధులు ఐదువేల రూపాయల ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు.

ఎంపీ ఫ్లెక్సీ చించివేతపై ఆగ్రహం

మద్దూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి అభిమానులు ఇటీవల ఏర్పాటుచేసిన ఫ్లెక్సీని జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అభిమాని తొడెంగల భాస్కర్ చించివేయడం పట్ల ఎంపీ వర్గీయులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తూ ఆందోళన చేపట్టారు. ఫ్లెక్సీలో కొమ్మూరి ఫోటో చిన్నదిగా ముద్రించడం పట్ల భాస్కర్ చించివేయడం గ్రామంలోని సీసీ కెమెరా ఫుటేజీలలో రికార్డు కావడాన్ని గమనించిన ఎంపీ వర్గీయులు అతడిని నిలదీశారు. చిల్లర రాజకీయాలకు పాల్పడటం సబబుకాదంటూ మండిపడ్డారు.

నిజాయితీ చాటుకున్న విద్యార్థిని

చేర్యాల, జూలై 30(ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం ముస్త్యాల గ్రామానికి చెందిన విద్యార్థిని గూడెపు దీపిక నిజాయితీ చాటుకుంది. బాసర రాజీవ్ ట్రిపుల్ ఐటీ చదువతున్న దీపిక బుధవారం రాత్రి కళాశాల నుంచి చేర్యాలకు వెళ్తుండగా అదేబస్సులో కామారెడ్డిజిల్లా చిట్యాల మండలం తాడ్వాయికి చెందిన ఎం.సంజీవులు పోగొట్టుకున్న సెల్‌ఫోన్ దొరికింది. ఆమె ఆ ఫోన్‌ను చేర్యాల పోలీసులకు అప్పగించడంతో విచారణ చేపట్టి అతడికి సమాచారం అందించారు. బుధ వారం సంజీవులు చేర్యాలకు రావడంతో అందజేశారు. నిజాయితీ చాటుకోవడం పట్ల దీపికను పోలీసులు అభినందించారు.

మహిళా సంఘాల ఉత్పత్తుల ప్రదర్శన


మహిళా సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులు, వ్యాపారాల వస్తువులు

హుస్నాబాద్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : వంద రోజుల ప్రణాళికలో భాగంగా బుధవారం హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో మహిళా సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులు, వ్యాపారాలను ప్రదర్శించారు. ఇందులో సంఘ సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులను విక్రయించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ మాట్లాడుతూ ఇందిరా మహిళా శక్తి, బ్యాంకు లింకేజీ స్త్రీనిధి ద్వారా తీసుకున్న రుణాలతో ఆర్థికంగా ఎదగాలని సూచించారు. హుస్నాబాద్ మున్సిపాలిటీలో 503 సంఘాలు ఉండగా ఇందులో 23 సంఘాలకు రూ. 2 కోట్ల రుణాలు ఇప్పించామన్నారు.

ధారగుట్టను కాపాడండి

సిద్దిపేట అర్బన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి సమీపంలోని ధారగుట్ట వద్ద ఉన్న మట్టిని కొంతమంది వ్యక్తులు ఎటువంటి అనుమతులు లేకుండా తవ్వకాలు చేపట్టి ఇష్టానుసారంగా తరలిస్తున్నారని మిట్టపల్లి గ్రామస్థులు తెలిపారు. బుధవారం గ్రామానికి చెందిన యువకులు ధారగుట్టకు వద్దకు వెళ్లి పరిశీలించగా తవ్వకాలు జరుగుతున్నాయని ఈ విషయం అధికార దృష్టికి తీసుకువెళ్లామని అన్నారు. సంబంధిత రెవెన్యూ అధికారులు తవ్వకాల వద్దకు వచ్చి పరిశీలించి ఎటువంటి చర్యలు తీసుకోకుండానే వెళ్లిపోయారని మట్టి తవ్వకాలు చేపట్టిన వారితో మాట్లాడి వెళ్లిపోవడం వెనుక ఆంతర్యం ఏమిటని యువకులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు శాఖ సంబంధించి అక్రమంగా మట్టి తవ్వకాలు చేపట్టిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని యువకులు కోరుతున్నారు.

బీటీ పనులు పూర్తయ్యేనా ?

● పట్టించుకోని ప్రభుత్వం - మల్లన్న భక్తులు, ప్రయాణికులకు తప్పని తిప్పలు ● అసెంబ్లీ సమావేశాలలో ప్రస్తావించిన ఎమ్మెల్యే


నీరునిల్వ ఉండి చిత్తడిమయంగా దారి, కంకరమయంతో ప్రమాదకరంగా శబాషీగూడెం-సాల్వాపూర్ రోడ్డు

చేర్యాల, జూలై 30(ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండల శివారు శబాషీగూడెం గ్రామం నుంచి జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం సాల్వాపూర్ వరకు ప్రధానరోడ్డు అత్యంత ప్రమాదకరంగా మారింది. దారి పొడవునా కంకరమయం కావడంతో ప్రజలు, ప్రయాణికులు నానాతంటాలుపడుతున్నారు. చేసిన మేర బిల్లులు చెల్లించలేదన్న కారణంగా కాంట్రాక్టర్ పనులు అర్థాంతరంగా నిలిపి వేయడంతో అతీగతీలేకపోగా, ప్రయాణికులకు ప్రాణసంకటంగా మారింది. ఈమేరకు వివరాలిలా ఉన్నాయి. రాష్ట్రంలోని ప్రముఖ శైవక్షేత్రాలలో ప్రధానమైన కొమురవెల్లి మల్లన్న ఆలయ సందర్శనార్థం వచ్చిన భక్తులు జగదేవ్‌పూర్ మండలంలోని కొండపోచమ్మను దర్శించుకుని సమీపంలోని ఇదే దారిగుండా తక్కువ దూరంలో యాదాద్రికి పయనమవుతారు. అలాగే చేర్యాల మండల, పొరుగు గ్రామాల ప్రజలు పొరుగున రాజాపేట, ఆలేరు, యాదాద్రి-భువనగిరి జిల్లాలకు ప్రయాణిస్తుంటారు. కొన్నాళ్లక్రితం శబాషీగూడెం నుంచి సాల్వాపూర్ వరకు సుమారు 5కిలోమీటర్ల దూరం రోడ్డుపనులకు రూ.4.00కోట్లు మంజూరు చేశారు. పనులు చేపట్టిన కాంట్రాక్టర్ కంకర పనులు పూర్తిచేశాడు. చేసిన పనులకు సంబంధించి సుమారు రూ.1కోటి మేర బిల్లులు చెల్లించ లేదన్న కారణంగా బీటీ పనులు చేపట్టకుండా అర్థాంతరంగా నిలిపివేశారు. దీంతో కంకరతేలి దారి ప్రమాదకరంగా మారింది. వర్షం కురిస్తే నీరునిలిచి చిత్తడిమయమవుతుంది. పలు ప్రదేశాలలో గుంతలు ఏర్పడి వాహనాలు అదుపుతప్పుతున్నాయి. పలు సందర్భాలలో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. కేవలం ద్విచక్రవాహనం మినహా ఇతర వాహనాల రాకపోకలకు అనుకూలంగా లేదు. ఈదారి వెంబడి ప్రయాణించాలంటేనే జంకుతూ దూరాభారమైనప్పటికీ జగదేవ్‌పూర్ మండలం మీదుగా యాదాద్రికి పయనిస్తూ ప్రయాసపడుతున్నారు. ఈవిషయమై చాన్నాళ్లుగా పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నా పట్టించుకున్న నాథుడే లేకుండా పోయారు. శబాషీగూడెం నుండి సాల్వాపూర్ వరకు బీటీరోడ్డు నిర్మాణానికి రూ.4కోట్ల మేర నిధులు మంజూరయ్యాయి. పనులు చేపట్టినా కాంట్రాక్టర్ సుమారు రూ.1కోటి మేర బిల్లుల చెల్లింపు నిలిచిపోవడంతో పనులు ఆపివేశారు. బీటీ పనులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని ఆర్అండ్‌బీ డీఈఈ అశోక్‌కుమార్ అన్నారు.

అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే పల్లా

శబాషీగూడెం-సాల్వాపూర్ బీటీరోడ్డు పనులు అవశ్యం కావడంతో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజే శ్వర్‌రెడ్డి కొన్నినెలలక్రితం జరిగిన అసెంబ్లీ సమావేశాలలో రోడ్డు దుస్థితి గురించి ప్రభుత్వానికి విన్నవించారు. పెండింగ్ బిల్లులు అందించి బీటీ పనులు పూర్తిచేయించాలని సూచించారు. కానీ ప్రభుత్వం నుంచి స్పందన కానరాకపోవడంతో ఉసూరుమంటున్నారు. కొద్దిరోజులక్రితం సీపీఎం నాయకులు, స్థానికులు రోడ్డు దుస్థితి వివరిస్తూ జిల్లా కలెక్టరేట్‌లో వినతిపత్రాలు సమర్పించినా స్పందనలేకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. వాహనాలు అదుపుతప్పి గాయాలపాలవుతుండటంతో ఆందోళన చెందుతున్నారు. బీటీరోడ్డు పనులు త్వరితగతిన చేపట్టి అందుబాటులోకి తీసుకువచ్చేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


అసెంబ్లీ సమావేశాలలో ప్రస్తావిస్తున్న ఎమ్మెల్యే పల్లా (ఫైల్)

అధ్యాపకుల పోస్టు భర్తీకి దరఖాస్తులు

చేర్యాల, జూలై 30(ఆంధ్రజ్యోతి) : చేర్యాల కస్తూర్బాగాంధీ బాలికల జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న ఇంగ్లీష్, నర్సింగ్ సబ్జెక్టుల భర్తీకి అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రత్యేకాధికారి కృష్ణవేణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లీషు విభాగానికి సంబంధించి పీజీ, బీఈడీ, టెట్, నర్సింగ్ సబ్జెక్ట్‌కు సంబధించి బీఎస్సీ నర్సింగ్ పూర్తిచేసినవారు అర్హులని, ఆసక్తిగలవారు నేడు, రేపు కస్తూర్బాలో దరఖాస్తులు అందించాలని కోరారు.

పదేళ్లలో బీఆర్‌ఎస్ చేసిందేమి లేదు


ముఖ్యమంత్రి, మంత్రుల చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కొత్త రేషన్ కార్డు లబ్ధిదారులు, కాంగ్రెస్ నాయకులు

సిద్దిపేట రూరల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో ప్రజలకు చేసిందేమి లేదని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు గరిపల్లి రాములు ఆరోపించారు. బుధవారం సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్ గ్రామంలో కొత్త రేషన్ కార్డులు వచ్చిన లబ్ధిదారులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామిల చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు గ్యారెంటీలతో ప్రజలకు పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తుంది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కొత్త రేషన్ కార్డులు ఇవ్వకపోగా కనీసం రేషన్ కార్డులో కుటుంబ సభ్యులను చేర్పించేందుకు కూడా అవకాశం కల్పించలేదన్నారు. కాంగ్రెస్ పభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డును మంజూరు చేసి సన్న బియ్యం పంపిణీ చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలకు నమ్మకం పెరిగిందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రపభుత్వానికే పట్టత కట్టాలని ప్రజలు చూస్తున్నారన్నారు.

హైకోర్టు తీర్పుపై హర్షం

మిరుదొడ్డి, జూలై30 (ఆంధ్రజ్యోతి): 2003 డీఎస్సీ ద్వారా నియమితులైన ఉపాధ్యాయులపై పాతపెన్షన్ వర్తింపజేయాలని హైకోర్టు తీర్పును వెల్లడించడం పట్ల ఉపాధ్యాయులు శ్రీనివాస్, శివాజీలు హర్షవ్యక్తం చేశారు. బుధవారం అక్బర్‌పేటలో వారు మాట్లాడారు. ఉపాధ్యాయులకు పాతపెన్షన్ విధానాన్ని అమలుచేయాలని తీర్పు రావడం పట్ల హర్షించదగ్గవిషయమన్నారు.

గెస్ట్ ఉపాధ్యాయులకు ఆహ్వానం

సిద్దిపేట అర్బన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టపల్లి సమీపంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయం, జూనియర్ కళాశాలలో కామర్స్ బోధించుటకు గెస్ట్ ఉపాధ్యాయులకు ఆహ్వానం పలుకుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ అర్షియా బుధవారం ప్రెస్ నోట్‌లో తెలిపారు. పీజీ మరియు బీఎడ్ పూర్తయిన వారు సంబంధిత పత్రాలతో ఆగస్టు ఒకటి నుంచి నాలుగో తేదీ వరకు కళాశాలలో సంప్రదించాలని కోరారు.

వరుస దొంగతనాలతో రైతుల బెంబేలు

మిరుదొడ్డి, జూలై30 (ఆంధ్రజ్యోతి): వరుస దొంగతనాలతో రైతులు, ప్రజలు బెంబేలెత్తుతున్నారు. మండలంలో తరుచూ వ్యవసాయ పొలాల వద్ద ట్రాక్టర్ పరికరాలను, మోటర్ కేబుల్లు ఎత్తుకెళ్లతున్నారు. అయినా కూడా పోలీసులు దొంగలను పట్టుకోవడంలో పూర్తిగా విఫలమౌతున్నారు. మిరుదొడ్డి మండలం ధర్మారం గ్రామంలో వ్యవసాయ పొలాల వద్ద ట్రాక్టర్లకు సంబధించిన పరికాలను ఎత్తుకెళ్లడంతో రైతులకు కంటి మీద కునుకులేకుండా ఉంది. ఈవిషయంపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా కూడా ఇప్పటికీ పురోగతి లేదు. ఇప్పటికైనా పోలీసులు దొంగలను పట్టుకుని రైతులను కాపాడాలని ప్రజలంటున్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు

చిన్నకోడూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటును అందిస్తుందని ఏపీఎం ఆంజనేయులు అన్నారు. చిన్నకోడూరు, పెద్దకోడూరు గ్రామాల్లో బుధవారం గ్రామ సంఘాల ఆధ్వర్యంలోమహిళా మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మహిళా సంఘాల సభ్యులకు ప్రభుత్వం అందిస్తున్న వడ్డీ లేని రుణాలు, లోన్, ప్రమాద బీమా తదితర అంశాలను గూర్చి వివరించారు.

అత్యవసర పరిస్థితుల్లో మెరుగైన సేవలు


అంబులెన్స్ వాహన అధికారులను పరిశీలిస్తున్న క్వాలిటీ డిపార్ట్మెంట్ అధికారులు

కొండపాక, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రమాదాల బారిన పడిన వారికి మెరుగైన సేవలు అందించి వారి ప్రాణాలను కాపాడాలని 108 అంబులెన్స్ గ్రీన్ హెల్త్ సర్వీస్ ప్రతినిధులు పేర్కొన్నారు. బుధవారం కొండపాక 108 అంబులెన్స్ వాహనాన్ని ఈ ఎంఆర్‌ఐగ్రీన్ హెల్త్ సర్వీస్ క్వాలిటీ డిపార్ట్మెంట్ తనిఖీ అధికారి కిషోర్, ఉమ్మడి జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ షేక్ జాన్ షాహిద్, జిల్లా మేనేజర్ హరి రామకృష్ణ తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంబులెన్స్ పరిశీలించారు. ప్రమాదాల బారిన పడిన వారికి సిబ్బంది అందిస్తున్న సేవల తీరును పరిశీలించారు.

మంత్రి వివేక్‌ను విమర్శించే స్థాయి బీఆర్‌ఎస్ నాయకులకు లేదు

సిద్దిపేట జూలై 30 (ఆంధ్రజ్యోతి): మంత్రి వివేక్‌ను విమర్శించే స్థాయి బీఆర్‌ఎస్ నాయకులకు లేదని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ అన్నారు. బుధవారం సిద్దిపేట పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రాజెక్టుల నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు వ్యతిరేకం కాదని తెలిపారు. దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టుకు సంకల్పిస్తే, కావాలని కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారని, ఆ ప్రాజెక్టు పేరిట కేసీఆర్ కుటుంబం లక్షల కోట్లు దండుకున్నారని ఆరోపించారు. ఓర్వలేక కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సీఎం రేవంత్ రెడ్డిని బదనామ్ చేస్తున్నారని మండిపడ్డారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజకీయంగా లబ్ధి పొందేందుకు, బీఆర్ ఎస్ పార్టీ ఉనికిని కాపాడుకునేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై అబద్దాలతో ప్రజల ముందుకు వస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు గ్యాదరి మధు, గయాజుద్దీన్, అర్షద్, రాజిరెడ్డి, రవితేజ, మునీరుద్దీన్, స్నేహిత్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

సంతాన.. సంపా'ధనం'

(5వ పేజీ తరువాయి)

కానీ ఐవీఎఫ్ అసాధ్యమైన చికిత్స ఇందులో 40 శాతం వరకే సక్సెస్ రేటు ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. కానీ, నూటికి నూరు శాతం పిల్లలు పుట్టిస్తామని సిద్దిపేటలోని పలువురు వైద్యులు చెప్పడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. కొంతమంది ఫర్టిలిటీ విధానంపై నెలల కోర్సులు చేసి స్పెషలిస్టులుగా కొనసాగుతున్నారనే విమర్శలు ఉన్నాయి.

ఈ మార్గదర్శకాలు తప్పనిసరి..

● వాస్తవానికి ఫర్టిలిటీ స్పెషలిస్టు అంటే ఎంబీబీఎస్ గైనకాలజీ ఓబీజీ అభ్యసించి ఉండాలి.

● 36 నెలలపాటు అన్ని అనుమతులున్న ఒక ఫర్టిలిటీ సెంటర్‌లో వైద్యసేవలు అందించిన అనుభవం తప్పనిసరి.

● కనీసం 40 ఐవీఎఫ్ కేసుల్లో పాల్గొన్నట్లుగా వైద్యుల లాగ్‌బుక్ రికార్డులో నమోదై ఉండాలి.

● ఎ.ఆర్.టి(ఫర్టిలిటీ) సెంటర్‌ను నిర్వహించాలంటే లెవల్-1, లెవల్- 2 అనుమతులు తప్పనిసరి.

● నేషనల్ హెల్త్ మిషన్ బృందం రెండుసార్లయినా ఈ సెంటర్లను తనిఖీ చేయాలి. వైద్యుల అర్హతలను పరిశీలించాకనే సెంటర్ ఏర్పాటుకు మంజూరు పత్రం ఇస్తారు.

● ఇక ఐవీఎఫ్ ప్రక్రియను నిర్వహించాలంటే ఆండ్రాలజీ ల్యాబ్, ఆండ్రోటెక్ మిషన్ అందుబాటులో ఉండాల్సిందే.

● ల్యాబ్, ఐవీఎఫ్ ప్రక్రియలో ఫర్టిలిటీలో నిపుణులైన వైద్యులు, టెక్నీషియన్లు అర్హత ప్రకారం ఉండాలి.

● సెంటర్‌కు వచ్చే దంపతుల పూర్తి వివరాలు రికార్డుల్లో నమోదు చేయాలి. వారు ఖర్చు చేసిన ప్రతీ రూపాయికి బిల్లులు ఇవ్వాలి.

తనిఖీలు చేయాల్సిన తరుణం!

హైదరాబాద్‌లో సృష్టి ఫర్టిలిటీ సెంటర్‌లో జరిగిన అక్రమాలు రాష్ట్ర వ్యాప్తంగా ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. పిల్లలు లేని తల్లిదండ్రుల బాధను ఆసరాగా చేసుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరించి రూ.కోట్లు దండుకున్నారు. భార్యకు భర్త వీర్యాన్నే అందిస్తున్నామని మాయమాటలు చెప్పి, ఇతరుల వీర్యాన్ని వినియోగించిన సంఘటనలు అనేకం వెలుగు చూశాయి. డోనర్ల వివరాలు లేకుండా, రికార్డులు నిర్వహించకుండా ఫర్టిలిటీ సెంటర్‌ను నిర్వహించి చివరకు జైలుపాలయ్యారు. ఈ క్రమంలో సిద్దిపేటలోని సంతాన సాఫల్య కేంద్రాలను కూడా తనిఖీ చేయాల్సిన ఆవశ్యకత వైద్యాధికారులకు ఉంది. నేషనల్ హెల్త్‌మిషన్ మార్గదర్శకాల ప్రకారం అన్ని అర్హతలు ఉన్నాయా లేదా అనే విషయాలు తనిఖీలు చేస్తేనే తేటతెల్లం అవుతాయి.

క్రీడాభివృద్ధికి కృషి చేస్తాం

గజ్వేల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): క్రీడాభివృద్ధికి కృషి చేస్తామని క్రీడా జ్యోతి ఫౌండేషన్ సభ్యులు పేర్కొన్నారు. మిరుదొడ్డి మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ విద్యార్థులకు ఖోఖో పోల్స్‌ను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా సభ్యులు విజయరేఖ, గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. క్రీడల అభివృద్ధికి తమ వంతు ప్రయత్నం చేస్తామని తెలిపారు. వారితో సభ్యులు నవీన్, నరేష్ కుమార్, భాను, పీడీ దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నూతన కార్యవర్గం

హుస్నాబాద్ టౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ పట్టణ బీజేపీ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎంపిక చేసినట్లు ఆ పార్టీ పట్టణ అధ్యక్షులు బత్తుల శంకర్ బాబు తెలిపారు. పట్టణ ఉపాధ్యక్షులుగా వేల్పుల నాగార్జున్, బొడిగ వెంకటేష్,ప్రధాన కార్యదర్శులుగా గాదాసు రాంప్రసాద్, పలువురిని ఎంచుకున్నారు

చేర్యాలలో ఎన్‌ఎల్‌ఎం బృందం పర్యటన

● అన్ని రకాల ప్రభుత్వ పథకాలపై ఆరా

కంది, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కంది మండలంలోని చేర్యాల గ్రామ పంచాయతీలో బుధవారం నేషనల్ లెవెల్ మానిటరింగ్ (ఎన్ఎల్ఎం) బృందం సభ్యులు బీవీ సూరంజన్ రెడ్డి, ఎం. సాధిక్ అలీలు పర్యటించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై గ్రామస్థులతో ముచ్చటించి, అమలులో ఉన్న పథకాలపై గ్రామస్తుల సూచనలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు 5 మంది ఉపాధి హామీ కూలీలు, 5 మంది పెన్షనర్లతో పాటు ఎహెచ్‌జీ మహిళా సమాఖ్య సభ్యులతో సమావేశమై వారి కార్యక్రమాలు, రుణాలు, స్వయం ఉపాధి కార్యకలాపాలపై చర్చించారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో సమావేశమై ఇళ్ల నిర్మాణ స్థితిగతులపై అవగాహన పొందారు. అనంతరం ఈ కేంద్ర బృందం ఆ గ్రామంలోని రెవెన్యూ ప్లాంటేషన్ , బృహత్ పల్లె ప్రకృతి వనము, శ్మశానవాటిక, సీసీ రోడ్లు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రక్రియను పరిశీలించింది. గ్రామ పంచాయతీలో జరుగుతున్న కార్యకలాపాలు, ఖర్చుల నమోదు, ఆస్తుల వివరాల కోసం ఉపయోగిస్తున్న సాఫ్ట్‌వేర్/పోర్టళ్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో డీఆర్డీవో అడిషనల్ పీడీ, జి. బాల్ రాజ్, ఎంపీడీవో శ్రీనివాస్, పీఆర్ఏ ఈ శ్రీనాథ్ రెడ్డి, ఎంపీ ఓ మహేందర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సుధీర్ రెడ్డి, పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

మహిళల రక్షణకు నూతన చట్టాలు

గజ్వేల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): మహిళల రక్షణకు తెలంగాణ ప్రభుత్వం ఎన్నో చట్టాలను తీసుకొచ్చిందని గజ్వేల్ ఏసీపీ కోణం నరసింహులు అన్నారు. మహిళా డిగ్రీ కాలేజ్ ఎడ్యుకేషన్ హబ్ గజ్వేల్ విద్యార్థినులకు ఆయా చట్టాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవడంతో పాటు తెలిసిన వారికి, బంధువులకు అవగాహన కల్పించాలని విద్యార్థినులకు సూచించారు. అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్, మాటలు నమ్మవద్దని, సోషల్ మీడియాకు ఎంత దూరంగా ఉంటే భవిష్యత్ అంత మంచిగా ఉంటుందన్నారు. మహిళల భద్రతకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని, మహిళల భద్రత మా ముఖ్య బాధ్యత అన్నారు. భారతదేశంలో అమలవుతున్న నూతన చట్టాల గురించి ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళలు, బాలికలు కష్టపడి చదివి ఎన్నో ఉన్నత స్థానాల్లో స్థిరపడుతున్నారని, వారిని ఆదర్శంగా తీసుకుని చదవాలని సూచించారు. సమాజంలో మగవారితో పోటీపడి ఉద్యోగాలు సాధిస్తున్నారని తెలిపారు. ఎలాంటి వేధింపులకైనా గురయ్యే మహిళలు షీటీమ్‌కు ఫిర్యాదు చేయాలని, మహిళల వివరాలు గోప్యంగా ఉంచబడతాయన్నారు.

మోదీ, ఎంపీ చిత్రపటాలకు క్షీరాభిషేకం

వర్గల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : మెదక్ పార్లమెంట్ పర్యటన సందర్భంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పీఎం శ్రీ పథకం ద్వారా వర్గల్ జడ్పీహెచ్‌ఎస్‌కు రూ. 40.50 లక్షల నిధులు మంజూరు చేసినందుకుగాను బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు బొల్లిపల్లి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం వర్గల్ మండల కేంద్రంలోని స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాలో వర్గల్ పాఠశాల ఎంపిక కావడం, సైన్స్ ల్యాబ్, అదనపు గదులకు నిదులు మంజూరు కావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తే కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో పాటు మెదక్ ఎంపీ రఘునందన్ రావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ మాజీ అధ్యక్షులు శ్రీరామ్ శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి పంపరి రమేశ్, ఉపాధ్యక్షులు దిండి నాగరాజు, నాయకులు జంగం యాదగిరి, తదితరులు ఉన్నారు.

రామలింగేశ్వరా..'ప్రసాదం' ఏదీ?

(5వ పేజీ తరువాయి)

ప్రకారం ఏర్పడిందని చెబుతారు. శ్రీరాముడు వనవాసం నుంచి అయోధ్యకు వెళ్తుండగా, మాండవ్య నది (కూడవెల్లి వాగు) వద్ద సేద తీరారు. పుష్య అమావాస్య ఘడియల్లో రాముడు బ్రహ్మహత్యా పాతక దోషాన్ని పోగొట్టుకోవడానికి శివలింగ పూజ చేశారు. ఆంజనేయస్వామి కాశీ నుంచి శివలింగం తీసుకురాకపోవడంతో ఇసుక లింగంతో పూజలు నిర్వహించారు. అందుకే దీనికి రామలింగేశ్వరాలయం అని పేరు వచ్చింది. ఇక్కడ వేణుగోపాల స్వామి, సంగమేశ్వరస్వామి, గణపతి, వీరభద్రస్వామి, సుబ్రహ్మణ్య స్వామి, కాశీ విశ్వనాథస్వామి, బొబ్బిలి వీరన్న ఆలయాలు ఉన్నాయి. వీటిలో సగానికి పైగా ఆలయాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. 'ప్రసాద్' పథకం ద్వారానైనా వాటికి పునరుజ్జీవం వస్తుందని ఆశిస్తున్నారు.




శిథిలావస్థలో ఉపదేవాలయాలు

పర్యాటక క్షేత్రంగా కూడవెల్లి

తూర్పు నుంచి పడమర వైపు పారే నది దేశంలో కూడవెల్లి వాగు మాత్రమే అని చెబుతారు. తూర్పు కూడవెల్లి పెద్దవాగు, ఆలయానికి పశ్చిమం నుంచి చిన్నవాగు, అంతర్వాహినిగా సరస్వతి వాగు ప్రవహిస్తాయి. దీంతో దీనిని త్రివేణి సంగమంగా పిలుస్తారు. మూడు దశాబ్దాలుగా చుక్క నీరు లేక ఎండిపోయిన ఈ వాగు, ఐదేళ్లుగా మల్లన్నసాగర్ నీటితో జలకళను సంతరించుకుంది. మాఘ స్నానాలతో పాటు లక్షలాది మంది భక్తులు ఈ వాగులో స్నానం చేసి రామలింగేశ్వరుడిని దర్శించుకుంటారు.


గోపురం కట్టి వదిలేసిన అమ్మవారి ఆలయం

అన్ని బాగుంటే.. గొప్ప పర్యాటక కేంద్రం..

ఆలయం వద్ద వసతులు కల్పించి చిల్డ్రన్ పార్క్, ఎనగుర్తి గ్రామం వరకు బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలనే డిమాండ్ దశాబ్దాలుగా ఉంది. రోప్‌వే, స్నానపు గదులు, వాగుపై కాజ్‌వే నిర్మించి పర్యాటక శాఖ అందంగా తీర్చిదిద్దితే గొప్ప పర్యాటక కేంద్రంగా మారుతుంది. గతంలో దివంగత ఎమ్మెల్యే రామలింగారెడ్డి వాగులో బోటింగ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం దీనిని పరిశీలించి, బోటింగ్‌కు అవకాశం కల్పిస్తే సిద్దిపేట జిల్లాలో మరో ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా కూడవెల్లి రామలింగేశ్వరాలయం రూపుదిద్దుకుంటుంది.